# జగమంతా అంతర్జాల మయం !

## (29 అక్టోబర్ "అంతర్జాతీయ అంతర్జాల దినం" సందర్భంగా)

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్–ఏఐ యుగం వరకు మానవ జీవనశైలిలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ–మెయిల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, గూగుల్, ట్విట్టర్, వాట్సయాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి పదాలు చిన్న పిల్లలకు సహితం కంఠస్థం అయ్యాయి. కంప్యూటర్ వ్యవస్థను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచార వితరణ సుసాధ్యం చేయడాన్ని ఇంటర్నెట్‌గా చెప్పుకుంటున్నాం. 'ఇంటర్–కనెక్టెడ్ నెట్‌వర్క్'ను 'ఇంటర్నెట్' అంటున్నాం. ప్రపంచ మానవాళి అరచేతిలో స్మార్ట్‌ఫోన్ రూపంలో వైకుంఠం వెలిసింది. గూగులమ్మ పొట్టలో విశ్వ విజ్ఞానం అంతా దాగి పోయింది. అడిగిందే తడవుగా సమాచారాన్ని మనకు వడ్డిస్తోంది. నేటి "వరల్డ్ వైడ్ వెబ్'ను 1989లో "టిమ్ బెర్నర్ – లీ"లు కనుగొన్నా. పట్నం మేధావి నుంచి పల్లె నిరక్షరాస్యుడి వరకు అందరికీ ఇంటర్నెట్ ఆత్మీయ నేస్తం అయ్యింది. 29 అక్టోబర్ 1969 రోజు తొలిసారి కాలిఫోర్నియా యూనివర్సిటీలో 'చార్లీ క్లైన్'తో కలిసి 'లియోనార్డ్ క్లీన్‌రాక్' 'ఎల్', 'ఓ' (లాగిన్) అనే ఆంగ్ల అక్షరాలను ఎలక్ట్రానిక్ ఇంటర్నెట్ మెసేజ్ ద్వారా విజయవంతంగా పంపించడం జరిగింది.

**అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవం:**

ఆధునిక మానవుడు అంతర్జాల లేదా ఇంటర్నేట్ సంద్రంలో మునిగి తేలుతున్నాడు. ఇంటర్నేట్ వాడకుండా ఒక గంట గడవడం లేదు. స్మార్ట్‌ఫోన్ మానవ శరీరంలో మరో ఆధునిక అంగం అయ్యింది. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. విశ్వాన్ని కుగ్రామంగా మార్చిన ఘనత ఇంటర్నెట్ టెక్నాలజీదే అని నమ్ముతున్నాం. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలాన్ని వినియోగిస్తున్న నెటిజెన్లు అనేక ప్రయోజనాలను పొందుతున్నప్పటికీ పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగాలు, అసభ్యకర అవమానకర మాటలను కూడా వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. ఆ సృజనశీల ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 29 అక్టోబర్ రోజు ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ డే)" పాటించడం 2005 నుంచి ప్రారంభం అయ్యింది.

**జగమంతా అంతర్జాల మయం :**

నేటి 'ఇంటర్నెట్'ను ప్రారంభంలో 'ఆర్పినెట్' అని పిలిచే వారు. నేటి డిజిటల్–ఏఐ యుగంలో ఇంటర్నెట్‌ను "ఇన్ఫర్‌మేషన్ సూపర్ హైవే" అని పిలవాల్సిన స్థితి రావడం చూస్తున్నాం. ఇంటర్నెట్‌ను శోధించడాన్ని 'సర్ఫింగ్' అని, ఇంటర్నెట్ వినియోగదారులను 'నెటిజెన్' అని, వీడియో కాన్ఫరెన్స్‌ను 'వెబినార్' అని పిలుస్తున్నాం. గూగుల్ సహాయంతో ఒక ప్రశ్నకు 0.2 సెకన్లలో సమాధానాలు పొందుతున్నాం. 1971లో ఈ–మెయిల్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998సో గూగుల్, 2004లో ఫేస్‌బుక్, 2006లో ట్విట్టర్ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం గూగుల్‌ను "కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్" అని పిలుస్తున్నాం. అంతర్జాల సంద్రంలో మునిగిన నేటి డిజిటల్ మానవుడు ఎలక్ట్రానిక్ మెయిల్స్, పరిశోధనలు, డైన్‌లోడ్ ఫైల్స్, ఆన్‌లైన్ చర్చలు, ఈ–విద్య, వీడియో గేమ్స్, స్నేహాలు, ఈ–లైబ్రరీ, కృత్రిమ మేధ, ఆర్థిక – బ్యాంకింగ్ సేవలు, సమాచార వితరణ, వర్క్ ఫ్రం హోమ్, విజ్ఞాన బోధన, లాంటి అనేక ప్రయోజనాలను పొందుతున్నాడు. నేడు విశ్వవ్యాప్తంగా 5.56 బిలియన్ల అంతర్జాల వినియోగదారులు, 5.28 బిలియన్ల స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, ఇంటర్నెట్ వాడుకునే 68 శాతం ప్రపంచ ప్రజలు ఉన్నారు. నేడు అత్యధికంగా చైనాలో 975 మిలియన్లు, భారత్‌లో 806 మిలియన్లు, యూఎస్‌లో 322 మిలియన్ల అంతర్జాల వినియోగదారులు ఉన్నారు. ప్రతి ఏట ఒక మిలియన్ ఇంటర్నెట్ వినియోగదారులు కొత్తగా చేరుతున్నారు. నేడు ఇంటర్నెట్ సగటు వినియోగం 6 గంటల 42 నిమిషాలు, సోషల్ మీడియా సగటు వినియోగం 2 గంటల 16 నిమిషాల సమయం పడుతున్నది. నిత్యం దాదాపు 350 బిలియన్ల ఈ–మెయిల్స్ పంపడం జరుగుతున్నది.

**అందరం ఏకమై సురక్షితంగా అంతర్జాలాన్ని వాడుకుందాం:**

అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దాని పట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 11 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు "సురక్షిత అంతర్జాల దినం" లేదా "సేఫర్ ఇంటర్నెట్ డే"పాటించడం కూడా ఆనవాయితీగా మారింది.

నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది.

ఆన్‌లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి.

**ప్రధాన ఇంటర్నెట్ ఆన్‌లైన్ మోసాలు:**

ఇంటర్నెట్‌తో ఎంతో ప్రయోజనం పొందుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంతర్జాల వలలో చిక్కి జీవితాలు సర్వనాశనం కూడా కావచ్చని మన అనుభవం స్పష్టం చేస్తున్నది. అంతర్జాల వలయంలో అధిక సమయం మునిగితే ఓపిక నశించడం, ఒంటరితనం, నిద్రలేమి, అనారోగ్య సమస్యలు, కంటి చూపుపై దుష్ప్రభావం, ఏకాగ్రత లోపించడం, దుర్వార్తలను ప్రేరేపించడం, అశ్లీల సైట్స్‌తో భవిష్యత్తు సర్వనాశనం, పనిలో శ్రద్ధ తగ్గడం, స్థూలకాయ సమస్యలు, సైబర్ నేరాలు లాంటివి కలుగుతున్నాయి. ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్‌వేర్, ఆన్‌లైన్ గ్రూమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్‌లైన్ ప్రిడేటర్స్, సెక్సిటింగ్, రాన్‌సమ్‌వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్‌లైన్ అప్పుల వేధింపులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహనలేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి.

తగు విధంగా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటర్నేట్‌ను సురక్షితంగా వాడడం నేర్చుకొని భద్రంగా అంతర్జాల వలలో ఆనంద తాండవం ఆడుదాం, విజ్ఞాన వివేకాలను పొందుదాం, ఆన్‌లైన్ మోసగాళ్లకు ముచ్చెమటలు పట్టిస్తూ వారి భరతం పడదాం. ఇంటర్నెట్‌ను విశ్వ మానవాళి ప్రయోజనాలకు వినియోగిస్తూ, అన్ని రంగాల్లో ముందడుగు వేద్దాం.

–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రాష్ట్రపతిని కలిసిన భారతీయ పోలీసు సేవా శిక్షణార్థులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:"భారత పోలీసు సేవ 77వ రిక్రూట్ మెంట్ (2024 బ్యాచ్) శిక్షణార్థులు రాష్ట్ర పతిని నేడు (అక్టోబర్ 27) రాష్ట్రపతి భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ప్రొబేషన్‌లో ఉన్న అధికారులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ... ప్రపంచంలోనే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని తెలిపారు. మన దేశ ఆర్థిక వృద్ధిని కొనసాగించేందుకు, వేగవంతం చేయడం కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నుంచి మరింత పెట్టుబడులు అవసరమని ఆమె అన్నారు. ఏ రాష్ట్రం లేదా ప్రాంతంలోనైనా పెట్టుబడులను ఆకర్షించాలంటే శాంతి భద్రతలనేవి తప్పనిసరి అని రాష్ట్రపతి పేర్కొన్నారు. పెట్టుబడులు, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడంలో సమర్థవంతమైన పోలీసింగ్ కూడా ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. యువ అధికారుల నేతృత్వంలోని భవిష్యత్తు పోలీస్ బలగం వికసిత భారత్ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు.

యువ అధికారులు, అధికారం, అధికార స్థాయిలను చేపడతారు కాబట్టి.. అధికారంతో పాటు బాధ్యత కూడా వస్తుందని వారు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు. వారి చర్యలు, ప్రవర్తన ఎప్పుడూ ప్రజల పరిశీలనలోనే ఉంటాయని పేర్కొన్నారు. ఎప్పుడూ లాభదాయకమైనది కాకుండా, నైతికమైనదాన్ని ఎంచుకోవాలనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.. అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించేటప్పుడు కూడా న్యాయమైన విధానాలను అనుసరించాలని చెప్పారు. అధికారులు చట్టాలు, వ్యవస్థల ద్వారా ఎన్నో అధికారాలు పొందినప్పటికీ.. నిజమైన అధికారం వారి వ్యక్తిగత, వృత్తిపరమైన సమగ్రత నుంచే వస్తుందని తెలిపారు. నైతిక ఆధికారమే వారికి అందరి గౌరవం, నమ్మకాలను తెస్తుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు.

ఒక పోలీసు అధికారి తరచూ నేరాలు, నేరస్థులతో వ్యవహరించాల్సి వస్తుందని.. ఇది కొన్నిసార్లు వారిలో సానుభూతిని తగ్గించి, మానవత్వాన్ని మసకబార్చే ప్రభావాన్ని చూపవచ్చని రాష్ట్రపతి పేర్కొన్నారు. సమర్థవంతమైన అధికారిగా మారే క్రమంలో వారు తమలోని కరుణ, మానవతా స్వభావాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేకంగా ప్రయత్నించాల్సిన అవసరం ఉందని ఆమె అధికారులకు సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానం పోలీసింగ్ రంగాన్ని గణనీయంగా మార్చేసిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. దాదాపు పది సంవత్సరాల క్రితం 'డిజిటల్ అరెస్ట్' అనే పదాన్ని అర్థం చేసుకోవడం కూడా కష్టంగా ఉండేదని, కానీ నేడు అది పౌరులకు భయంకరమైన ముప్పుగా మారిందని ఆమె తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ వినియోగదారుల్లో భారత్ ఒకటని ఆమె పేర్కొన్నారు. ఈ మార్పు పోలీసింగ్ వ్యవస్థపైనా ప్రభావం చూపనుందని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలో కొత్త సాంకేతికతలను, ముఖ్యంగా ఏఐని స్వీకరించడంలో తప్పుడు ఉద్దేశంతో ఉపయోగించే వ్యక్తుల కంటే ఐపీఎస్ అధికారులు ముందుండాలని ఆమె సూచించారు.

# ఢిల్లీలో జాతీయ వ్యవసాయ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 28: జాతీయ వ్యవసాయ విద్యార్థుల సమావేశాన్ని ఈ రోజు న్యూఢిల్లీలోని పూసాలో నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల వ్యవసాయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సమావేశంలో పాలుపంచుకున్నారు. వేల మంది విద్యార్థులు దృశ్య మాధ్యమం సాయంతో దీనిలో భాగం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్)తో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌధరి దృశ్య మాధ్యమం సాయంతో ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

వ్యవసాయ రంగంలో పరిశోధననూ, ఆధునిక సాంకేతికతలనూ, నవకల్పననూ, సాంకేతిక బదిలీని ప్రోత్సహించే ధ్యేయంతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ విద్య స్థాయిని ఇప్పటి కన్నా మెరుగుపరిచి, యువ ప్రతిభావంతులలో స్ఫూర్తిని రగిలిస్తూ, వారు చురుకుగా పాల్గొనేలా పరిశోధన కార్యక్రమాల్ని తీర్చిదిద్దాలని సమావేశంలో తీర్మానించారు.

వ్యవసాయ విద్యాసంస్థల్లో చాలా ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నందుకు శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగంలో ఆందోళన వ్యక్తం చేశారు. చక్కని విద్యను విద్యార్థులకు అందించే ఉద్దేశంతో ఈ ఖాళీలను భర్తీ చేసే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్‌ను ఆయన ఆదేశించారు. అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లోనూ, కళాశాలల్లోనూ ఉద్యోగ ఖాళీలను త్వరగా భర్తీ చేసే చర్యలు తీసుకొనేలా ముఖ్యమంత్రులందరికీ తాను లేఖలు రాస్తాననీ, ఈ విషయంపై వ్యవసాయ మంత్రులతోనూ చర్చిస్తాననీ కేంద్ర మంత్రి ప్రకటించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ విద్యార్థుల భవిష్యత్తు విషయంలో రాజీ పడకూడదని శ్రీ చౌహాన్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో జాతీయ విద్యా విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిన విషయాన్ని కేంద్ర మంత్రి గుర్తు చేస్తూ, దేశంలో అత్యున్నత నాణ్యతతో కూడిన వ్యవసాయ విద్యను బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత సవాళ్లను అధిగమించేలా విద్య బోధనతో పాటు సంస్థాగత ఏర్పాట్లకు మెరుగులు దిద్దడానికి వ్యవసాయ విద్యార్థుల నుంచి కొత్త కొత్త ఆలోచనలను రాబట్టేందుకు ఒక విద్యార్థి బృందాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఐసీఏఆర్‌ను శ్రీ చౌహాన్ ఆదేశించారు.

ఆరోగ్యదాయక పోటీని ప్రోత్సహించడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో పాటు కళాశాలలను వర్గీకరించాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యుత్తమ పద్ధతులను పరిశీలించి వాటిని మన దేశంలో ఎలా అనుసరించగలమో ఆలోచించాల్సిందిగా ఐసీఏఆర్‌ను ఆయన కోరారు. "మనం వ్యవసాయంతో పాటు పల్లెలను కలిపి అభివృద్ధి చేస్తే, వలసలు ఆగిపోతాయి. ఇది కూడా దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడమే" అని ఆయన అన్నారు. "మనం స్వయం సమృద్ధి సాధనకు శ్రమించి తీరాలి. అది జరిగిన నాడు, భారత ప్రగతి మరే ఇతర దేశంపైనా ఆధారపడబోదు. వ్యవసాయం వర్ధిల్లకపోతే అభివృద్ధి చెందిన, స్వయంసమృద్ధి యుక్త భారత్‌ను ఆవిష్కరించలేం" అని ఆయన తేల్చిచెప్పారు.

ప్రతిదీ అభ్యాస పూర్వకంగా తెలుసుకోవడానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వాలని శ్రీ చౌహాన్ సూచించారు. నేరుగా విషయాలను తెలుసుకోవడానికి విద్యార్థుల్లో ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం ఒక్కసారైనా పంటపొలాల వద్దకు వెళ్లి, రైతులకు ఎదురవుతున్న సవాళ్లపై అవగాహన ఏర్పరుచుకోవాలని ఆయన చెప్పారు. రైతుల సమస్యలకు విద్యార్థులు పరిష్కారాలను ఆలోచించడంతో పాటు దేశ వ్యవసాయ రంగం రూపురేఖలలో గణనీయ మార్పులు తెచ్చేందుకు తమ వంతు పాటుపడాలని ఆయన అన్నారు.

సమాజానికి ప్రయోజనాత్మక సేవలు అందించండంటూ విద్యార్థులను కేంద్ర మంత్రి ప్రోత్సహించారు. "వ్యవసాయ విద్యార్థులు సీదాసాదా జీవనంతో తృప్తి పడిపోకూడదు. వారు ఒక లక్ష్యాన్ని పెట్టుకుని, జీవనాన్ని సార్థకం చేసుకోవాలి. ఇతరులకు అండగా నిలబడితేనే సిసలైన జీవనానికి అర్థం" అని కేంద్ర మంత్రి ఉద్బోధించారు.

ఐసీఏఆర్‌కు చెందిన విద్య విభాగం, భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ)లు కలిసి ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కేంద్ర వ్యవసాయ మంత్రితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. వారు ఆసక్తిదాయక చర్చలు నిర్వహించారు. విద్యార్థులు ఈ సందర్భంగా తమ అనుభవాన్ని పంచుకోవడమే కాక కొత్త సాంకేతికతలను కూడా ప్రస్తావించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని ముందుకు తీసుకుపోవడంలో తమ వంతుగా పాటుపడతామంటూ నిబద్ధతను పునరుద్ఘాటించారు. వారు చెప్పిన సమస్యలను శ్రీ చౌహాన్ సావధానంగా విని, తగిన చర్యలు తప్పక తీసుకుంటామన్నారు. విద్యార్థుల భవిత వెలుగులీనాలని ఆయన కోరుకుంటూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు.




# పిన్నేరు వాగుపై అధికారులు అప్రమత్తం

అమరావతి, అక్టోబర్ 28: నెల్లూరు జిల్లా సైదాపురం మండలం పరిధిలో పిన్నేరు వాగుపై నిఘా అవసరమని, తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అధికారులను అప్రమత్తం చేయడంలో భాగంగా తహసిల్దార్ ఎం సుభద్ర, ఎంపీడీఓ రామ్మోహన్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం నందు సమీక్ష సమావేశం ను నిర్వహించారు.

# 200 మందికి భోజన ఏర్పాటు..

అమరావతి, అక్టోబర్ 28: చిల్లకూరు మండలం తిక్కవరం గిరిజన కాలనీలో లోతట్టు ప్రాంతం లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలనీ వాసులందరికీ సుమారు 200 మందికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాసులు, తిక్కవరం ల తీ నీ శ్రీనివాస్, పంచాయతి సెక్రటరీ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశువులు బాగుంటేనే వ్యవసాయాభివృద్ధి!



భూపాలపల్లి, అక్టోబర్ 28:పశువులు బాగుంటేనే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ , మత్స్యశాఖ, స్పోర్ట్స్, యూత్ సర్వీసెస్ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ రోజు భూపాలపల్లి జిల్లా లోని రేగొండ, గణపురం మండలాల్లో మంత్రి వాకిటి శ్రీహరి విస్తృతంగా పర్యటించారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రేగొండలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమంలో పాల్గొని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం ఘనప సముద్రం చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 100% సబ్సిడీతో అందజేసిన చేప పిల్లలను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది మత్స్య శాఖ పై ఆధారపడి జీవిస్తున్నాం న్నారు. గత ప్రభుత్వం పాడిపరిశ్రమలు, మత్స్యశాఖ అభివృద్ధిని మరిచిపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో 3 కోట్ల 26 లక్షల పశువులు ఉన్నాయని, 54 లక్షల టీకాలు లక్ష్యం కాగా ఇప్పటికే 25 లక్షల టీకాలు వేయడం పూర్తయిందన్నారు. గాలికుంటు వ్యాధితో పశువుల్లో పాల, సంతాన ఉత్పత్తి తగ్గుతుందని, రానున్న రెండేళ్లలో గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం మత్స్యశాఖను పట్టించుకోలేదని, చెరువుల్లో చేపలు, రొయ్యలు పోయకున్నా పోసినట్లు రికార్డు చూపి నిధులు పక్కదారి పట్టించారన్నారు.

ప్రజా ప్రభుత్వంలో రూ. 123 కోట్ల నిధులను ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీకి కేటాయించడం జరిగిందన్నారు. చిన్న కుటుంబాలను బాగు చేయడమే కాంగ్రెస్ సంకల్పం అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ సాయి కుమార్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ లు శ్రీదేవి,కిష్టయ్య, జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆసోద కుమారస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ్, రేగొండ పశువైద్యాధికారి మైథిలి, గణపసముద్రం మత్స్యశాఖ అధ్యక్షులు గుల్ల రాజు, గణపతి, కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అక్కడ స్పెషల్ ఫోకస్ పెట్టిన ఎమ్మెల్యే



అమరావతి, అక్టోబర్ 28:మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం నుండి గూడూరు నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాభావం వలన తీర ప్రాంత ప్రజలు, గిరిజనులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వేకువజాము నుండి కురుస్తున్న వర్షాభావంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ఎమ్మెల్యే సహకారంతో నాయకుల ఆధ్వర్యంలో ఆహారం సైతం అందించడంలో నిరంతరం కృషి చేస్తున్నారు. మంగళవారం గూడూరు నియోజకవర్గంలోని తీర ప్రాంతమైన వాకాడు పులపాలెం, బాల్రెడ్డిపాలెం, వెంకన్నపాలెం, స్వర్ణముఖి బ్యారేజ్ వంటి తదితర ప్రాంతాలలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశిం కుమార్ అధికారులతో కలిసి సందర్శించి తీరప్రాంతాలలో ప్రజల సమస్యలు తెలుసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

అదేవిధంగా నియోజక వర్గం లోని స్థానిక నాయకులు తప్పనిసరిగా తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలి అన్నారు. అధికారులతో కలిసి అన్ని ప్రాంతాలను పర్యవేక్షిస్తూ ప్రజలకు అన్ని వసతులు ఏర్పాటు చేసే విధంగా పని చేయాలని ఆదేశించారు. గూడూరు మండలంలో విందూరు గ్రామంలో ఒక పునరా వాస కేంద్రం కల్పించి కొంతమందిని అందులో ఉంచారు. అదేవిధంగా చిల్లకూరు మండలంలోని తమ్మిన పట్నం గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి 96 మంది గిరిజనులను అక్కడ ఉంచారు. అలాగే వారికి ఆహారం త్రాగునీరు సదుపాయం కల్పిస్తున్నారు. అదేవిధంగా చిల్లకూరు మండలంలో తాసిల్దారు శ్రీనివాసులు ఓడూరు, కృష్ణాపురం గిరిజన కాలనీ వంటి తదితర ప్రాంతాలలోని గిరిజనులకు దాదాపు 500 మంది వరకు ఆహారం త్రాగునీరు సదుపాయం కల్పిస్తున్నారు. అదేవిధంగా కోట మండలంలోని చిట్టెడు గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి తాహసిల్దార్ జై జై రావు తీర ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వారిని పునరావాస కేంద్రానికి తరలించేందుకు వాహనాలు కూడా సిద్ధం చేసి అన్ని వసతులు ఏర్పాటు చేసి ఉంచారు.

అదేవిధంగా గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో తిరుపతి పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో చెన్నూరు గ్రామం గిరిజన కాలనీని సందర్శించారు. అక్కడ గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వారికి అవసరమయ్యేటటువంటి అన్ని వసతులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో ప్రత్యేక అధికారి శోభన్ బాబు ఆధ్వర్యంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పట్టణంలోని పలు ప్రాంతాలు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోటు పాలెం గ్రామంలో ఎమ్మెల్యే సూచనల మేరకు కోటా సునీల్ కుమార్, కమిషనర్ వెంకటేశ్వర్లు రూరల్ ఎస్సై తిరుపతయ్య ఆధ్వర్యంలో గిరిజనులకు ఆహారం అందజేసి వారికి ఎటువంటి అవసరం వచ్చిన నిత్యం అందుబాటులో ఉండడం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

# భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్ (బీఐఆర్‌సీ)-2025 నిర్వహణకు వాణిజ్య శాఖ మద్దతుపై స్పష్టత

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:సమష్టిగా నిర్ణయాలు తీసుకోవడం, వాణిజ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఆర్థిక రంగంలోని సంబంధిత వాటాదారులందరితో క్రమం తప్పకుండా చర్చిస్తోంది. దేశ వ్యవసాయ సంబంధిత ఎగుమతుల్లో బియ్యం అగ్రస్థానంలో ఉంది. 2024-25లో 12.95 బిలియన్ డాలర్ల ఎగుమతుల విలువతో ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా ఉంది. ఈ రంగం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్ (బీఐఆర్‌సీ)-2025కు వాణిజ్యశాఖ, ఇతర సంబంధిత మంత్రిత్వ శాఖలు-విభాగాలు సంయుక్తంగా ఆర్థికేతర మద్దతును అందిస్తున్నాయి.

ఈ నెల 30?31 తేదీల్లో న్యూఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో బీఐఆర్‌సీ-2025 నిర్వహిస్తున్నారు. బియ్యం రంగానికి చెందిన ప్రైవేట్ వాణిజ్య సంస్థ ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ (ఐఆర్ఈఎఫ్) ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఇందులో రైస్ సెక్టార్‌కు చెందిన ఎగుమతిదారులు, ఈ వ్యవస్థతో సంబంధం ఉన్న వ్యక్తులంతా పాల్గొంటారు. ఐఆర్ఈఎఫ్ సభ్యులు, అధ్యక్షుడి నియామకంలో వాణిజ్యశాఖ పాత్ర ఉండదు.

ఐఆర్ఈఎఫ్‌తో పాటు దేశంలోని ఇతర ప్రముఖ బియ్యం ఎగుమతి సంఘాలైన (బాస్మతియేతర బియ్యం కోసం) ది రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్, ఛత్తీస్‌గఢ్ (టీఆర్ఈఏ-సీజీ)... ది రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఈఏ), కాకినాడ వంటి సంఘాలు ఈ కార్యక్రమానికి సహ-భాగస్వామ్యం అందిస్తున్నాయి.

వ్యవసాయ సంబంధిత, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే బాధ్యత కలిగిన వ్యవసాయ-శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి అథారిటీ (ఏపీఈడీఏ)... బియ్యం ఎగుమతుల విస్తరణ, ప్రోత్సాహానికి సమగ్రమైన సమన్వయంతో కూడిన చర్యలను నిర్ధారించడానికి సమావేశంలో సంబంధిత మంత్రిత్వ శాఖలు-విభాగాలను భాగస్వామ్యం చేయడం ద్వారా ఈ కార్యక్రమానికి మద్దతునిస్తోంది.

వేదిక బుక్ చేయడం, కొనుగోలుదారులకు ఆతిథ్యం (ప్రయాణ ఛార్జీలు, వసతి) వంటి అన్ని రవాణా సంబంధిత ఏర్పాట్ల కోసం అయ్యే మొత్తం ఖర్చులను ఐఆర్ఈఎఫ్, దాని ఇతర సహ-భాగస్వాములు తమ సొంత నిధులతో గానీ, ప్రైవేట్ స్పాన్సర్‌షిప్‌ల ద్వారాగానీ చెల్లిస్తాయి. ప్రదర్శన నిర్వహణ ఖర్చులు, కొనుగోలుదారు-అమ్మకందారుల సమావేశాలు, సాంకేతిక సమావేశాల ఖర్చులతో పాటు వీడియోలు, బ్యానర్లు, పోస్టర్లు, ప్రదర్శనకు అయ్యే సృజనాత్మక ఖర్చులనూ పూర్తిగా నిర్వాహకులే భరిస్తున్నారు.

ఐఆర్ఈఎఫ్ జాతీయ అధ్యక్షుడిపైన గానీ, ఐఆర్ఈఎఫ్ కార్యకలాపాల గురించి గానీ పత్రికల్లో వచ్చే నిర్దిష్ట ఆరోపణలకు సంబంధించి వాణిజ్య శాఖ ఎటువంటి వ్యాఖ్యలు చేయదు. ఇది పూర్తిగా వ్యక్తిగతమైన, ప్రైవేట్ వాణిజ్య సంస్థ వ్యక్తిగత వ్యవహారం కాబట్టి... ప్రభుత్వ వాణిజ్యశాఖ దీనిలో ఎలాంటి జోక్యం చేసుకోదు.

# భారత్‌కు చేరుకున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్


న్యూఢిల్లీ, అక్టోబర్ 28:యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సైనిక బలగాల కమాండర్ మేజర్ జనరల్ యూసఫ్ మాయుఫ్ సయీద్ అల్ హల్లామి 2025 అక్టోబర్ 27, 28 తేదీల్లో భారత్‌లో అధికారిక పర్యటన చేపడుతున్నారు. ద్వైపాక్షిక సైనిక సహకారాన్ని విస్తరించడానికి, భాగస్వామ్యానికి ముఖ్యంగా శిక్షణ, సామర్థ్య విస్తరణ అంశాల్లో కొత్త అవకాశాలను అన్వేషించడమే ఈ ఉన్నత స్థాయి పర్యటన లక్ష్యం. రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న రక్షణ మైత్రిని మరింత బలోపేతం చేయడానికి చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ఇది తెలియజేస్తుంది.

మేజర్ జనరల్ యూసఫ్ మాయుఫ్ సయీద్ అల్ హల్లామికి అధికారిక స్వాగతం పలికి.. ఆపరేషన్ సిందూర్ గురించి సమగ్రంగా వివరించారు. ఆయనకు దేశ రక్షణ సామర్థ్యాలు, సైన్యం కోసం కృత్రిమ మేధ ప్రణాళిక గురించి భారత ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఆర్మీ డిజైన్ బ్యూరో డీజీ వివరించారు.

జాతీయ యుద్ధ స్మారకం వద్ద మేజర్ జనరల్ యూసఫ్ మాయుఫ్ సయీద్ అల్ హల్లామి 2025, అక్టోబర్ 28న పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పిస్తారు. అనంతరం డీఆర్‌డీవోను సందర్శించి దేశీయంగా అభివృద్ధి చేసిన వివిధ ఆయుధాలు, పరికరాల గురించి తెలుసుకుంటారు. అలాగే రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీవో ఆర్ అండ్ డీ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వీ కామత్‌తో చర్చిస్తారు. పరస్పర ఆసక్తి ఉన్న అంశాలపై భారతీయ రక్షణ రంగ పరిశ్రమల ప్రతినిధులతో కూడా కమాండర్ సంభాషిస్తారు.

రెండు దేశాల మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారంలో ముఖ్యమైన విజయాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సైనిక బలగాల కమాండర్ మేజర్ జనరల్ యూసఫ్ మయూఫ్ సయీద్ అల్ హల్లామి పర్యటన సూచిస్తుంది. ఇప్పటికే దృఢంగా ఉన్న రక్షణ సంబంధాలను ఈ పర్యటన మరింత విస్తరిస్తుంది. సైనిక భాగస్వామ్యం, ప్రాంతీయ భద్రతా సహకారంలో బలమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తుంది.

# “శ్రీ నరేంద్ర మోదీ - నిబద్ధ పరిపాలన దక్షుడు” పుస్తక ఆవిష్కరణ



హైదరాబాద్, అక్టోబర్ 28:నల్లకుంట శంకరమఠం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో సాధించిన విజయాలను విశ్లేషిస్తూ, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు రచించిన “శ్రీ నరేంద్ర మోదీ - నిబద్ధ పరిపాలన దక్షుడు” అనే గ్రంథాన్ని నేడు నల్లకుంట శంకరమఠంలో శ్రీశృంగేరి శారదా పీఠాధిపతి శ్రీశ్రీ విద్యాశేఖర భారతీ స్వామిజీ వారే ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా స్వామిజీ, గ్రంథంలోని అంశాలపై రచయితతో సమగ్రంగా సంభాషించి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం స్వామిజీ, రచయితను ఆశీర్వదించి, ప్రసాదంతో పాటుగా గోడ గడియారాన్ని బహుమతిగా అందజేశారు. తరువాత మీడియాతో మాట్లాడిన డా. వకుళాభరణం ఇలా అన్నారు: “మోదీజీ 75వ జన్మదినం సందర్భంగా గత సెప్టెంబర్ 17న నేను ఒక ప్రత్యేక వ్యాసావళి రచించి ఆవిష్కరించాను. కాగా ఇప్పుడు ఆయన పదేళ్ల పాలనలో సాధించిన విజయాలపై సమగ్ర అధ్యయనం చేసి ఈ గ్రంథాన్ని రచించాను

. దేశానికే కాక, ప్రపంచానికి అందించిన ఆయన నాయకత్వాన్ని పత్రికా ఆధారాలతో అందరికీ చేరువ చేయడం నా లక్ష్యం.”

# పదాతిదళ దినోత్సవాన్ని జరుపుకుంటున్న భారత సైన్యం.. ఇది 79వ శౌర్య దివస్





న్యూఢిల్లీ, అక్టోబర్ 28:పదాతిదళ దినోత్సవం లేదా శౌర్య దివస్ సందర్భంగా భారత సైన్యం న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద నివాళి కార్యక్రమం నిర్వహించింది. పదాతిదళ సైనికుల పరాక్రమానికి, త్యాగానికి, అలుపెరుగని స్ఫూర్తికి శ్రద్ధాంజలి ఘటించింది.

దేశ సేవలో ప్రాణలర్పించిన పదాతిదళ సైనికుల ధైర్య సాహసాలు, అత్యున్నత త్యాగాలను గౌరవిస్తూ జాతీయ యుద్ధ స్మారక చిహ్నంలోని అమర్ చక్ర వద్ద ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ ఆర్మీ అధికారులు, ప్రస్తుత సైనికులు, మాజీ సైనికులు, యుద్ధ వీరుల కుటుంబసభ్యులు హాజరయ్యారు.

వీర్ చక్ర పురస్కార గ్రహీతలు, పదవీ విరమణ పొందిన ముగ్గురు సైనికులు మేజర్ ఆశిశ్ సోనాల్, ఆపరేషన్ పవన్ (1990); సుబేదార్ మేజర్ అండ్ గౌరవ కెప్టెన్ కున్వర్ సింగ్, ఆపరేషన్ మేఘదూత్ (1989), లాన్స్ నాయక్ అమృత్, ఆపరేషన్ కాక్టస్ లిల్లీ (1971), పదాతిదళ మాజీ సైనికుల తరపున నివాళులు అర్పించటం ద్వారా పరాక్రమం, నిస్వార్థ సేవల శాశ్వత వారసత్వం స్పష్టమైంది.

ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జరిగిన వేడుకల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. లక్నోలో ఫీల్డ్ మార్షల్ కె.ఎం. కరియప్ప స్మారక సెమినార్, ఢిల్లీలోని కంటోన్మెంట్ లో శౌర్యవీర్ రన్, వీర నారీమణులకు సన్మాన కార్యక్రమాలు జరిగాయి. పదాతిదళ బహుముఖ సామర్థ్యాన్ని స్పష్టం చేస్తూ, సాహసోపేతమైన కథనాలను వివరిస్తూ రూపొందించిన ‘ఇన్ ఫాంట్రీ మ్యాగజైన్’ను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఏటా అక్టోబర్ 27న జరుపుకునే పదాతిదళ దినోత్సవం దేశ చరిత్రలో కీలకమైన రోజు. 1947లో ఇదే రోజున, భారత సైన్యంలోని పదాతి దళ సిబ్బంది శ్రీనగర్ విమానాశ్రయానికి చేరుకున్న తొలి సైనికులుగా నిలిచారు. అనంతరం ఈ దళాలు చేపట్టిన సాహసోపేత కార్యకలాపాలు పాకిస్తాన్ మద్దతున్న గిరిజన దండ యాత్రను తిప్పి కొట్టి, దేశ సరిహద్దు భద్రతను కాపాడాయి. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో పదాతిదళాల స్థిరమైన అంకితభావం, ప్రదర్శించిన సాటిలేని అంకితభావానికి ఈరోజు శాశ్వత గుర్తుగా నిలిచింది.

# విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2025 సందర్భంగా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించిన కేంద్ర మంత్రి శ్రీ జేపీ నడ్డా

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2025లో భాగంగా.. మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు సిబ్బందితో కలసి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ప్రతిజ్ఞ చేశారు.

“సతర్కత: హమారీ సాఝా జిమ్మేదారీ” (జాగరూకత: మన ఉమ్మడి బాధ్యత) అనే అంశంపై 2025 అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు దేశవ్యాప్తంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. కేంద్రీయ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా సేవలో నైతికతను, పారదర్శకత్వాన్ని, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

ప్రతిజ్ఞ సందర్భంగా నైతిక విధానాలను వ్యవస్థీకృతం చేయడం, పరిపాలనలో ప్రతి దశలోనూ జాగరూకతగా ఉండే సంస్కృతిని నిర్మించాల్సిన అవసరాన్ని శ్రీ నడ్డా స్పష్టం చేశారు. “ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రజలు తప్పు చేయకుండా ఉండటానికి వారికి అర్థమయ్యే విధంగా అత్యంత సరళమైన భాషలో చేయాల్సిన, చేయకూడని పనుల జాబితాను సిద్ధం చేయాలి. అందరూ అవగాహనతో, అప్రమత్తంతో వ్యవహరించడానికి.. శిక్షణ, సామర్థ్య నిర్మాణం నిరంతర ప్రక్రియగా ఉండాలి” అని ఆయన అన్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2025కు సన్నాహకంగా.. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఒక నోటీసును ఈ ఏడాది ఆగస్టు నెలలో జారీ చేసింది. దానిలో 2025 ఆగస్టు 18 నుంచి నవంబర్ 17 వరకు మూడు నెలల పాటు అవినీతిని నిరోధక నిఘాపై ప్రచారం నిర్వహించాలని అన్ని సంస్థలకు సూచించి.. ప్రధానంగా అయిదు కీలకాంశాలపై దృష్టి సారించాలని కోరింది. అవి: పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించడం, పెండింగ్ కేసుల పరిష్కారం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, ఆస్తుల నిర్వహణ, డిజిటల్ కార్యక్రమాలు.

ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా సేవలో నైతిక విలువలను, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలనే తమ అంకితభావాన్ని సుస్పష్టం చేశారు.

# పోలీస్ అధికారులకు రివార్డ్..



సూర్యాపేట, అక్టోబర్ 28:స్టేషన్ హౌస్ ఆఫీసర్ పని విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ గత నెలలో కేసుల దర్యాప్తు, ఇన్వెస్టిగేషన్‌లో బాగా పని చేసిన కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్‌ను సూర్యాపేట టూ టౌన్ ఎస్సై శివతేజను, అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్‌లను ఎస్పి నరసింహ అభినందించి రివార్డ్ అందించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించి గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు. అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలని, పిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేసుకోవాలన్నారు.

రాత్రిళ్ళు పెట్రోలింగ పటిష్టంగా చేయాలని, కేసులు పెండింగ్ లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పని చేయాలని పోక్సో కేసుల్లో, మహిళా సంభంద కేసుల్లో వేగంగా దర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పని చేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. పోలీసు పని విభాగాల్లో సమర్థవంతంగా, వేగవంతమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పని చేయాలని ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులను, ప్రజలను రోడ్డు భద్రత పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. నేరాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సీసీటీవీ కెమెరాలుఏర్పాటు చేసేలా ప్రజలను, వ్యాపారులను చైతన్యం చేయాలని పేర్కొన్నారు.

# ప్రత్యేక ప్రచార కార్యక్రమం 5.0ను వేగంగా అమలు చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల విభాగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:ఆఫీసు ప్రాంగణాల్లో పెండింగ్ పనులను పూర్తి చేయటానికి, పరిశుభ్రత పాటించడానికి ప్రత్యేక ప్రచార కార్యక్రమం 5.0ను ప్రభుత్వ రంగ సంస్థల విభాగం (డీపీఈ) అమలు చేస్తోంది. సీజీఓ కాంప్లెక్స్ ఆవరణలోని కార్యాలయాల్లోనే కాక, పరిసరాల్లోనూ పరిశుభ్రంగా ఉండేలా డీపీఈ పర్యవేక్షిస్తుంది.

ఫేజ్ ఎ (16.09.2025 - 30.09.2025): సన్నాహక దశ ఈ దశలో ఎంపీల సిఫార్సులు, పార్లమెంటరీ హామీలు, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు, అంతర మంత్రిత్వ శాఖల కమ్యూనికేషన్లు, ప్రజా ఫిర్యాదుల వంటి పెండింగ్ అంశాలను గుర్తిస్తారు. శుభ్రపరచాల్సిన, మెరుగుపరచాల్సిన, సుందరీకరించాల్సిన ప్రాంతాలను కూడా ఎంపిక చేస్తారు.

ఫేజ్ ఎఎ (02.10.2025 -31.10.2025): అమలు దశ - గుర్తించిన పెండింగ్ అంశాలను పరిష్కరించటం, ఎంపిక చేసిన ప్రాంతాల్లో స్వచ్ఛత, సుందరీకరణ, నిర్వహణ పనులను ఈ దశలో చేపడతారు.

ఈ ప్రచార కార్యక్రమంలో ఒక సీటీయూ స్థలాన్ని గుర్తించి దాన్ని సుందరీకరించారు. ఎంపీల సిఫార్సులు, పార్లమెంటరీ హామీలు, అంతర మంత్రిత్వ శాఖల కమ్యూనికేషన్లు, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు, పీఎంఓ సిఫార్సుల అంశాలన్నీ పరిష్కరించారు. మొత్తం 550 ఫైళ్లను సమీక్షించి, తొలగించాల్సిన పాత ఫైళ్లను గుర్తించి, ఫేజ్ ఎఎలో వాటిని తొలగించారు.

ప్రత్యేక ప్రచార కార్యక్రమం 5.0 పురోగతిని సమీక్షించేందుకు కార్యదర్శి (డీపీఈ) 24 అక్టోబర్ 2025న డీపీఈ ఆవరణను తనిఖీ చేశారు. ఆఫీసులో వినియోగ స్థలాన్ని పెంచేందుకు, నిరుపయోగమైన వస్తువులు, ఏఐఓ, ప్రింటర్లు, డెస్క్ టాప్ లు వంటి స్క్రాప్ మెటీరియల్ ను గుర్తించి, వాటిని తీసివేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ 45 వస్తువులను గుర్తించగా, వాటిని నిరుపయోగమని నిర్ధారించి, తొలగించే ప్రక్రియను 28.10.2025న చేపడతారు. దీని ద్వారా 180 చదరపు అడుగుల స్థలం వినియోగంలోకి వస్తుంది.

# సిపిఐ శాతాబ్ది బహిరంగ సభను జయప్రదం చేయాలి : పల్లా వెంకటరెడ్డి




నల్లగొండ, అక్టోబర్ 28 : ఖమ్మం వేదికగా డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని ఖమ్మంకు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్ర భాగాన నిలిచిందని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో ఉన్న రూ.33 వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును సంక్షోభంలో ఉన్న అదానీ కంపెనీకి కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం ఎల్ఐసీలో దేశ ప్రజల సొమ్మును అదానీకి ధారాదత్తం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన వరి ధాన్యం, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వరి, పత్తి తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. వరి ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు సరైన వసతులు కల్పించాలన్నారు. అదేవిదంగా సిపిఐ శతాబ్ది బహిరంగ సభ విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా నవంబర్ 17 నుండి చేపట్టిన సిపిఐ జాతను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశానికి ఉజ్జిని యాదగిరి రావు అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి అది రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బోల్గురి నర్సింహ, నల్పరాజు రామలింగయ్య, తీర్పాటి వెంకటేశ్వర్లు, తుమ్మ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర కీలకం

ఖమ్మం, అక్టోబర్ 28: రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర కీలకం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం లోని కృషి విజ్ఞాన కేంద్రం ను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన కేంద్రంలో చేపడుతున్న నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, భూసార పరీక్షా కేంద్రం కార్యకలాపాలు, సమగ్ర వ్యవసాయ నమూనా యూనిట్లను సమీక్షించారు. కేంద్రం లోని పరిశోధన, శిక్షణా కార్యక్రమాలు, రైతు అవగాహన కార్యక్రమాలపై శాస్త్రవేత్తలతో చర్చించి, రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ జిల్లా వ్యాప్తంగా రైతులకు అందిస్తున్న సాంకేతిక మార్గదర్శకత, పంటల విస్తరణ కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ పథకాల అనుసంధానం, శిక్షణా కార్యక్రమాలపై కలెక్టర్ కి సమగ్రంగా వివరించారు.

అనంతరం గిరిజన ఉపాధి పథకంకింద కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇల్లందు మండలం లోని పోపెల్లి గ్రామానికి చెందిన రైతులతో ముచ్చటించి, పట్టుపురుగుల పెంపకం, విప్పపువ్వు సాగు, సమగ్ర వ్యవసాయం పద్ధతులు వంటి ఆధునిక వ్యవసాయ విధానాలపై వారికి అవగాహన కల్పించారు. రైతులు ఆధునిక పద్ధతులను అవలంబిస్తే పంటల దిగుబడి పెరుగుతుందని, ఆదాయం కూడా పెరుగుతుందని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కృషి విజ్ఞాన కేంద్రాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రైతులకు శాస్త్రీయ అవగాహన, సాంకేతిక సహాయం, మరియు సమగ్ర వ్యవసాయ పద్ధతుల ప్రచారం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచడంలో ఈ కేంద్రాల పాత్ర అత్యంత ప్రాముఖ్యమైనది అని పేర్కొన్నారు. తరువాత కలెక్టర్ కృషి విజ్ఞాన కేంద్రంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలు, విత్తనోత్పత్తి క్షేత్రాలు, మరియు రైతు మద్దతు సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన భూసార పరిశీలన సదుపాయాలు విస్తరించాలి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంట రకాలను అభివృద్ధి చేయాలి, మరియు రైతులకు సాంకేతికత చేరే విధంగా డిజిటల్ అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

# గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించాలి : సీడీపీఓ తూముల నిర్మల

నల్గొండ, అక్టోబర్ 28: మహిళలు గర్భిణులుగా నమోదైన నాటి నుండి ప్రసవం జరిగి చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చేంత వరకు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బీటీఎస్, దుర్గాకాలనీ, రవీంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. రెండు, మూడో సారి గర్భం దాల్చిన ప్రతి స్త్రీ అరోగ్య పరిస్థితితో పాటు వారు డెలివరీ కాగానే కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. రెండు లేదా మూడో కాన్పులో అమ్మాయిలు పుడితే వారు వదిలిచ్చుకునేందుకు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారని, అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా వారిని చైతన్యం చేయాలన్నారు.

ముఖ్యంగా మూడో కాన్పుకు వచ్చిన వారిపై నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేయాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు కనబడకపోతే విచారణ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. శిశు విక్రయాలపై అంగన్‌వాడీ టీచర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, సరస్వతి, టీచర్లు గుత్తా రజిత, కె.విజయలక్ష్మి, ఆయాలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

# మునుగోడులో డీపీఓ ఆకస్మిక పర్యటన

నల్గొండ, అక్టోబర్ 28: మునుగోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలను ఎంఈఓ తలమల్ల మల్లేశంతో కలిసి స్పెషల్ ఆఫీసర్, డీపీఓ వెంకటయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించి, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యుగంధర్ రెడ్డి, తాసీల్దార్ నరేశ్, సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ నర్మద, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ పథకం కింద5500 కోట్లకు పైగా పెట్టుబడితో చేపట్టే 7 ప్రాజెక్టుల తొలి బ్యాచ్‌కు ప్రభుత్వ ఆమోదం




న్యూఢిల్లీ, అక్టోబర్ 28:దేశంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద ?5500 కోట్లకు పైగా పెట్టుబడితో చేపట్టే 7 ప్రాజెక్టుల తొలి బ్యాచ్‌కు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్-సమాచార సాంకేతికత శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఇకపై "మల్టీ-లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ)లు, హెచ్‌డీఐ పీసీబీలు, కెమెరా మాడ్యూళ్లు, కాపర్ క్లాడ్ లామినేట్లు, పాలీప్రొపైలిన్ ఫిల్ములు" వంటివి దేశీయంగా తయారవుతాయని ఆయన పేర్కొన్నారు.

దీంతో సంపూర్ణ ఉత్పత్తులనే కాకుండా వాటి కోసం వినియోగించే విడి పరికరాల తయారీకి కావాల్సిన మాడ్యూళ్లు, విడి భాగాలు, పదార్థాలు-యంత్రాల ఉత్పత్తి వరకూ ఓ కీలక ముందడుగు పడింది.

'ఈసీఎంఎస్'కు అద్భుత ప్రతిస్పందన

ఈ పథకానికి జాతీయ, అంతర్జాతీయ కంపెనీల నుంచి అద్భుత స్పందన లభించింది. ఈ మేరకు మొత్తం 249 దరఖాస్తులు అందిన నేపథ్యంలో ?1.15 లక్షల కోట్ల పెట్టుబడి, ?10.34 లక్షల కోట్ల ఉత్పత్తి సహా 1.42 లక్షల ఉద్యోగాల సృష్టికి ఇవి దోహదం చేస్తాయి. భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇప్పటిదాకా అత్యధిక పెట్టుబడులకు హామీ రావడం విశేషం.

ఈ నేపథ్యంలో ?5,532 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. వీటిద్వారా మొత్తం ?36,559 కోట్ల విలువైన విడి భాగాల ఉత్పత్తితోపాటు 5,100కు పైగా ప్రత్యక్ష ఉద్యోగాల సృష్టికి బాటలు పడతాయి.

ప్రభుత్వం ఆమోదించిన ఈ ప్రాజెక్టులలో 5 తమిళనాడులో, 1 ఆంధ్రప్రదేశ్‌లో, 1 మధ్యప్రదేశ్‌లో ఏర్పాటవుతాయి. సమతుల ప్రాంతీయ వృద్ధితోపాటు మహా నగరాలకు మించి విస్తరిస్తున్న అత్యాధునిక తయారీ రంగాన్ని బలోపేతం చేస్తుంది.

డిమాండ్-సరఫరా అంతరం తగ్గింపు

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ- "ఈ కొత్త యూనిట్లు దేశీయంగా 20 శాతం ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, 15 శాతం కెమెరా మాడ్యూళ్ల సబ్-అసెంబ్లీ డిమాండును తీర్చగలవు" అని ప్రకటించారు.

అలాగే 100 శాతం కాపర్ క్లాడ్ లామినేట్ డిమాండ్ కూడా ఇప్పుడు పూర్తిస్థాయిలో దేశీయంగానే తీరుతుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఈ ప్లాంట్ల ద్వారా అదనంగా 60 శాతం ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి.

ఆమోదం పొందిన ప్రాజెక్టులలో "హై-డెన్సిటీ ఇంటర్‌కనెక్ట్ (హెచ్‌డీఐ) పీసీబీలు, మల్టీ-లేయర్ పీసీబీలు, కెమెరా మాడ్యూళ్లు, కాపర్ క్లాడ్ లామినేట్లు, పాలీప్రొపైలిన్ ఫిల్ములు" వంటి కీలక విడి భాగాలు తయారవుతాయి.

కెమెరా మాడ్యూళ్లు అంటే- ఎలక్ట్రానిక్ పరికరాలలో ఫోటోలు, వీడియోలను సంగ్రహించే సూక్ష్మ ఇమేజింగ్ యూనిట్లు. ఇవి దేశీయంగా ఉత్పత్తయితే స్మార్ట్ ఫోన్లు, డ్రోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, వైద్య పరికరాలు, రోబోలు సహా ఆటోమోటివ్ వ్యవస్థలలో వినియోగం పెరుగుతుంది.

అలాగే హెచ్‌డీఐ, మల్టీ-లేయర్ పీసీబీలంటే- ప్రతి ఎలక్ట్రానిక్ పరికరాన్ని అనుసంధానించే, నియంత్రించే కీలక సర్క్యూట్ బోర్డులు. వీటిని స్మార్ట్ ఫోన్లతోపాటు ల్యాప్‌టాప్‌లు, ఆటోమోటివ్- పారిశ్రామిక వ్యవస్థలలో వినియోగిస్తారు.

మూల సరంజామా తయారీలో వ్యూహాత్మక ప్రగతి

పరికరాల తయారీ రంగంలో భారత్ పటిష్ఠ ప్రవేశాన్ని 'ఈసీఎంఎస్' ప్రస్ఫుటం చేస్తుంది.

దీనికింద భారత్ తొలిసారిగా కాపర్ క్లాడ్ లామినేట్ (సీసీఎల్) తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తోంది. ఇది 'మల్టీ-లేయర్ పీసీబీ'ల తయారీకి మూల సరంజామా తయారీ యూనిట్‌గా ఉంటుంది. ఈ 'పీసీబీ'లను ప్రతి ఎలక్ట్రానిక్ పరికరంలో ఉపయోగిస్తారు. ప్రస్తుతం వీటిని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

ఇక పాలీప్రొపైలిన్ ఫిల్మ్ ప్రధానంగా కెపాసిటర్ల తయారీలో ఉపయోగించే పదార్థం. దేశీయంగా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, ఐసీటీ, ఇండస్ట్రియల్- మాన్యుఫాక్చరింగ్, టెలికమ్యూనికేషన్స్, కంప్యూటింగ్ పరికరాల కోసం దీన్ని తయారు చేస్తారు.

పూర్తిస్థాయిలో ఎలక్ట్రానిక్ పరికరాలకు రూపకల్పన, తయారీతోపాటు ఎగుమతులు కూడా చేయగల దేశంగా మారే దిశగా భారత్ తన పయనం కొనసాగిస్తోంది.

ఈ పథకం 'పీఎల్ఐ'తోపాటు ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) లక్ష్యాల సాధనలో దోహదం చేయగలదు.

పరికరాల నుంచి చిప్‌ల దాకా, విడి భాగాల నుంచి సరంజామా దాకా తయారీ నుంచి ఆవిష్కరణ వరకూ నిరంతరాయ విలువ వ్యవస్థకు ఈ పథకం రూపమిస్తుంది.

# ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశీయంగా, అంతర్జాతీయంగా మరింత పెరిగిన భారత్ ఖ్యాతి: రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాలు స్వదేశీ పరికరాలను సమర్థవంతంగా వినియోగించడం... భారత్ ప్రతిష్ఠను దేశీయంగా, అంతర్జాతీయంగా మరింతగా బలపరిచాయని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశీయ పరిశ్రమలను ముఖ్యంగా ప్రైవేట్ రంగాన్ని ఆవిష్కరణ, పరిశోధన-అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా స్వావలంబన సాధనను మరింత వేగవంతం చేయాలని సూచించారు. సాంకేతిక ఆధారిత తయారీ, ఉప వ్యవస్థలకు చెందిన విడిభాగాల ఉత్పత్తి, సరఫరా, నిర్వహణ వ్యవస్థపై ఆధిపత్యం చెలాయించడం ద్వారా స్వావలంబన సులభతరం అవుతుందని పేర్కొన్నారు. 2025 అక్టోబర్ 27న న్యూఢిల్లీలో 'రక్షణ స్వావలంబన: దేశీయ పరిశ్రమల ద్వారా జాతీయ భద్రత బలోపేతం' అనే అంశంపై నిర్వహించిన భారత రక్షణ తయారీదారుల సంఘం వార్షిక సదస్సులో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్, ఆకాశ్ తీర్ ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ సిస్టమ్, ఇతర స్వదేశీ పరికరాల శక్తిని ప్రపంచం ప్రత్యక్షంగా చూసిందని, ఈ దాడి విజయానికి సాహసవంతులైన సాయుధ దళాలతోపాటు ఆవిష్కరణ, రూపకల్పన, తయారీ రంగాల్లో ముందుండి పనిచేసిన పరిశ్రమ యోధులకు దక్కుతుందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఆయన భారతీయ పరిశ్రమను సైన్యం, నౌకాదళం, వాయుసేనలతో సమానంగా ఉన్న రక్షణ వ్యవస్థలో అత్యంత కీలకమైన స్తంభాలలో ఒకటిగా అభివర్ణించారు.

"మేం దృఢ సంకల్పంతో స్పందించినప్పటికీ.. మన దళాలు దేశ సరిహద్దులను రక్షించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ, మనం నిరంతరం ఆత్మపరిశీలన చేసుకోవడం కొనసాగించాలి. ఆపరేషన్ సిందూర్ మన భవిష్యత్తు వ్యూహానికి మార్గదర్శకంగా నిలిచే ఒక అధ్యయనంగా ఉపయోగపడాలి. ఈ సంఘటన మన సరిహద్దుల్లో ఎప్పుడైనా, ఎక్కడైనా ఏదైనా జరగవచ్చని మళ్లీ మనకు చూపించింది. మనం ఎల్లప్పుడూ యుద్ధం లాంటి పరిస్థితులకు సిద్ధంగా ఉండాలి. మన సంసిద్ధత మన సొంత పునాదిపై ఆధారపడి ఉండాలి" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

ప్రస్తుత ప్రపంచ అనిశ్చిత పరిస్థితులు.. ప్రతి రంగంలో లోతైన విశ్లేషణ అవసరాన్ని పెంచుతాయని, నిరంతరం మారుతున్న రక్షణ రంగం, యుద్ధ స్వభావం నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు స్వదేశీ ఏకైక మార్గమని రక్షణ మంత్రి తెలిపారు. "ప్రపంచ స్థాయి వ్యవస్థలు బలహీనపడుతున్నాయి. అనేక ప్రాంతాల్లో ఘర్షణలు పెరుగుతున్నాయి. దీనివల్ల భారత్ తన భద్రతా వ్యూహాన్ని పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది" అని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం రక్షణ తయారీని పెంచడానికి, దేశీయ వ్యవస్థను బలపరచడానికి సమాన అవకాశాలను సృష్టిస్తోందని.. పరిశ్రమలు ఈ అవకాశాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. "రక్షణ పరికరాలను దేశంలో వినియోగించడానికే కాకుండా, 'మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ది వరల్డ్' స్ఫూర్తిని ప్రతిబింబించే పరికరాలను రూపొందించడానికి నిజమైన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా మేం కృషి చేస్తున్నాం" అని అన్నారు.

ఆవిష్కరణ, పరిశోధన-అభివృద్ధి సంస్కృతిని పెంపొందించడానికి క్వాంటం మిషన్, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. దేశంలో ఇంతవరకు సాధించని లక్ష్యాలను మన పరిశ్రమ సాధించాలని అన్నారు.

ప్రభుత్వ స్వావలంబన ప్రయత్నాల వల్ల సాధించిన పురోగతిని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. 2014 కి ముందు భారత్ తన భద్రతా అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపై ఆధారపడి ఉండేదని, కానీ నేడు అది తన సొంత గడ్డపై రక్షణ పరికరాలను తయారు చేస్తోందని అన్నారు. "2014లో సుమారు రూ. 46,000 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తి విలువ, ఇప్పుడు రికార్డు స్థాయిలో రూ. 1.51 లక్షల కోట్లకు చేరింది. ఇందులో రూ. 33,000 కోట్లు ప్రైవేట్ రంగం నుంచి వచ్చాయి. 10 సంవత్సరాల కిందట రూ. 1,000 కోట్ల కంటే తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు, ఇప్పుడు సుమారు రూ. 24,000 కోట్లకు చేరాయి. మార్చి 2026 నాటికి ఈ ఎగుమతులు రూ. 30,000 కోట్లను చేరుకుంటాయనే నమ్మకం నాకు ఉంది. ఇటీవలే మేం డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ 2025ను తయారు చేశాం. డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్ 2020ను సవరించే పనులు కొనసాగుతున్నాయి" అని రక్షణమంత్రి తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో దేశీయ రక్షణ తయారీకి ప్రైవేట్ రంగం తన సహకారాన్ని ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి కనీసం 50 శాతానికి పెంచాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కోరారు.

స్వదేశీకరణను మరింత పెంచేందుకు, పరిశ్రమ సరఫరా, నిర్వహణ వ్యవస్థపై ఆధిపత్యం కోసం కృషి చేయాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కేవలం పూర్తిస్థాయి పరికరాల తయారీకే పరిమితమవకుండా, పరికరాల ఉపవ్యవస్థలు, విడిభాగాల స్వదేశీ తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు."ఈ రోజుల్లో మనం విదేశాల నుంచి ప్రధాన పరికరాలను కొనుగోలు చేసినప్పుడు వాటి జీవితకాలం వాటి నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ, విడిభాగాల నిర్వహణ వంటివి.. ఆర్థిక భారంగా మారుతుంది. ఇది మన వనరులపై ఒత్తిడిని కలిగిస్తుంది. ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితిని పెంచుతుంది. ఒక పూర్తిస్థాయి పరికరానికి అనేక భాగాలు, ముడిపదార్థాలు ఉన్నందున.. ఈ ఉప-వ్యవస్థల స్వదేశీ తయారీ ద్వారా మన దేశీయ తయారీని పెంచుకోవచ్చు. 'మన నేల, మన రక్షణ' మొదటి ప్రాధాన్యతగా ఉండేలా చూడాలి" అని అన్నారు.

కేవలం దేశంలో వినియోగించడమే లక్ష్యం కాదని, దేశంలోనే సాంకేతిక ఆధారిత తయారీని అభివృద్ధి చేయడం కావాలని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. "ఏ సాంకేతిక బదిలీ అయినా సమర్థవంతంగా ఉండాలి. ఇది మన స్వదేశీ పరిశ్రమలను శక్తిమంతం చేసే మార్గంగా కూడా పనిచేయాలి."

ఆవిష్కరణ, పరిశోధన లేకుండా ఏ దేశం కూడా అభివృద్ధిని సాధించలేదని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. వచ్చే ఏడాది ఎస్ఐడీఎమ్ పది సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా.. పెద్ద ఎత్తున పూర్తిస్థాయి సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని ప్రోత్సహించారు.

"ఐడెక్స్, అదితి ద్వారా మన యువ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు సవాళ్లు, సమస్యల గురించిన సమాచారం లభించింది. నేడు పెద్ద ఎత్తున పూర్తిస్థాయి సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేసి, వాటిని మనకు అందించే సవాలును పరిశ్రమ స్వీకరించాలి. మేం వాటిని చర్చించి లోపాలను భర్తీ చేస్తాం. ప్రైవేటు రంగంతో కలిసి ముందుకు సాగడమే మా ప్రయత్నం. మనం కలిసి పనిచేయడం ద్వారా రక్షణ రంగం రూపురేఖలను మొత్తం మార్చగలం" అని అన్నారు. దీనికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రక్షణశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, ఎస్ఐడీఎమ్ అధ్యక్షుడు శ్రీ రాజిందర్ సింగ్ భాటియా, ఎస్ఐడీఎమ్ డైరెక్టర్ జనరల్ రమేష్ కే, మాజీ ఎస్ఐడీఎమ్ అధ్యక్షుడు శ్రీ ఎస్ పీ శుక్లా, సాయుధ దళాలు, రక్షణ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, పరిశ్రమ నాయకులు, యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు : డీపీవో వెంకటేశ్వర్‌రావు

ఆదిలాబాద్, అక్టోబర్ 28:జిల్లాలోని పంచాయతీ అధికారులు, కార్యదర్శులు విధుల్లో అలసత్వం వహిస్తూ పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా పంచాయతి అధికారి డీ వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. మంగళవారం తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఐబీతో పాటు పలు కాలనీల్లో పర్యటించిన డీపీవో పలు విధుల్లో పేరుకుపోయిన చెత్త అపరిశుభ్రమైన వాతావరణాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేసారు. చెత్త రోడ్లపై వేసిన పలు దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు.

మురుగు కాలువలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టాలని, పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలని, చెత్తను బయట వేసే దుకాణదారులను గుర్తించి వెంటనే వారికి నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించడం జరిగింది. అనంతరం సుబద్ర కాలనీలో ఉర్దూ స్కూల్, అంగన్వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేసి ఎంపీడీవో కార్యాలయంను సందర్శించారు. డీపీవో వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్ కుమార్, కార్యదర్శి దొండ దివాకర్ ఉన్నారు.

## ఉద్యమ పోరాటాల ద్వారానే ఎస్సీ వర్గీకరణ సాధించాం.. ఎమ్మార్పీఎస్

### -జగిత్యాల కోర్టు కు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు
### -ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



కరీంనగర్, అక్టోబర్ 28: ఉద్యమ పోరాటాల వలనే ఎస్సీ వర్గీకరణ సాధించామని కోర్టు కు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన న్యాయస్థాన కోర్టు కు ఎమ్మార్పీఎస్ నేతలు మంగళవారం హాజరయ్యారు.

ఎమ్మార్పీఎస్ నాయకులు, మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ప్రధానమంత్రి తెలంగాణ పర్యటన సందర్భంగా జాతీయ రహదారి దిగ్బంధం చేయడంలో భాగంగా 2022 ఆగస్టు 3 న కరీంనగర్ ప్రధాన రహదారి మల్యాల ఎక్స్ రోడ్ వద్ద దిబ్బంధం చేశారు.

మల్యాల పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఏ.2గా నక్క సతీష్, ఏ3 గా సురుగు శ్రీనివాస్, ఏ4 గా బొల్లె అనిల్ పై కేసు నమోదయ్యాయి.

ఎమ్మార్పీఎస్ నాయకుల తరుపున న్యాయవాది బిరుదుల లక్ష్మణ్ తో జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘకాలం పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందని, న్యాయబద్ధమైన మా పోరాటాన్ని వంచి వేయడానికి మాపై కేసులు పెట్టి ఉద్యమాన్ని ఆపే విధంగా ప్రయత్నించారని తెలిపారు. వెంటనే ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## రైతులు వరి కోతలు తాత్కాలికంగా నిలిపివేయాలి : ఏవో రాజశేఖర్ గౌడ్

మెదక్, అక్టోబర్ 28: చిలిపిచెడ్ మండలంలోని రైతులు వర్షాలు దృష్టిలో పెట్టుకొని తమ వరి కోతలను నిలిపివేయాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని జగ్గంపేట గ్రామంలో ఏర్పాటుచేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఏవో రాజశేఖర్ గౌడ్ సందర్శించారు. ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తడిసి ముద్దయిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు.

అనంతరం ఏవో రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకోవాలని సూచించారు. అదేవిధంగా తడిచిన వడ్లు మొలకెత్తకుండా 50 గ్రా.ఉప్పు లీటరు నీటికి( 5% ఉప్పు ద్రావణం) కలిపి పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా 2,3 రోజులు వర్షాలు ఉన్నందున రైతులు వరి కోతలు తాత్కాలికంగా ఆపివేయాలని సూచించారు.

రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్‌లోనే ధాన్యం అమ్మాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం 17% మించి ఉండరాదని, ధాన్యం ఆరిన తర్వాత తాళ్లు, మట్టి పెళ్లలు లేకుండా నాణ్యమైన విత్తనాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిత, సెంటర్ ఇంఛార్జి అశోక్, రైతులు మాణిక్యం రెడ్డి, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నల్గొండ, అక్టోబర్ 28:రానున్న 48 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులపై రెండు రోజులు పాటు టార్పాలిన్ పట్టాలు కప్పే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం, అర్వపల్లి, వేల్పుచర్లలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి పొలాలు కోయకుండా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, డీఎం రాము, తాసిల్దార్ శ్రీకాంత్, ఏఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఏఓ గణేశ్, ఏఈఓ సత్యం, ఏపీఎం రాంబాబు, సెంటర్ ఇన్‌చార్జి విజయ ఉన్నారు.

అర్వపల్లి మండల పరిధిలోని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. 4, 5వ తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారితో ఇంగ్లీష్ చదివించి తెలుగులో అర్థాలను అడిగి తెలుసుకున్నారు. అంతటితో ఆగకుండా గణితంలో సంకలనం, వ్యవకలనం, గుణాంకాలను బోర్డుపై చేయించి వారితోనే సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు సరైన సమాధానాలు చెప్పడం, చక్కగా రాయడం, మంచి ప్రతిభను చూపించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ సంతోషంతో విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులంటే ఇలా ఉండాలని, ఉపాధ్యాయుల పనితీరు విద్యార్థులు చదువులోనే కనిపిస్తుందన్నారు. ఉపాధ్యాయులు ధర్మయ్య, నీరజ, సుధారాణి, వెంకన్నను అభినందించారు.

## విద్యార్థుల సమగ్ర వికాసానికి కథలు దోహదం : కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి



నల్గొండ, అక్టోబర్ 28:విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, సమగ్ర వికాసానికి కథలు ఎంతగానో దోహద పడతాయని పిల్లల కథా రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ మర్రిగూడ ప్రాథమిక ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని గుట్టకింది అన్నారం ప్రాథమిక పాఠశాలకు తాను రాసిన బంతిపూలు, బహుమతి, మొలకలు, ఊగుతున్న ఉయ్యాల, బాల చెలిమి, చేతిరాత వంటి బాల సాహిత్య పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రచయిత బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు చిన్నప్పటి నుండే కథలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే అనేక ప్రభుత్వ పాఠశాలలకు బాల సాహిత్య పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనిమద్దె సైదులు, గౌతమి, గ్రామ కార్యదర్శి సాయి చరణ్, కోమటిరెడ్డి అరుణ, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

నల్గొండ, అక్టోబర్ 28: ఆత్మకూరు(ఎం) మండలంలోని లింగరాజుపల్లిలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బుషి గణేష్ (26) తన ఇంటి మరమ్మతు పనుల్లో భాగంగా సిమెంట్ పనుల కోసం ఇనుప పైపులతో గోవా ను ఏర్పాటు చేశారు.

ఇంటి మరమ్మతు పనులు పూర్తి కావడంతో ఇనుప పైపులను గణేశ్ తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు 10 మీటర్ల దూరంలో ఉన్న తీగలకు పైపు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గణేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

## రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి..

### -రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 28:(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాజన్నసిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆసు పత్రిలోని సదరం శిబిరంతో పాటు మెటర్నటీ, ఆప్తమాలజీ, ఎమర్జెన్సీ వార్డులు రక్త పరీక్షల ల్యాబ్‌లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు చిత్తశుద్ధితో సేవలు అందించాలని అన్నారు. సదరం శిబిరాన్ని సందర్శించి అక్కడికి వివిధ నిర్ధారణ పరీక్షల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. సదరం రిజిస్ట్రేషన్, వైద్య పరీక్షలు, వివరాల నమోదు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

సదరం శిభిరానికి వచ్చే వారి కోసం మౌళిక వసతులు కల్పించాలని, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్, డీఆర్డీవో శేషాద్రి, వైద్యులు సంతోష్ కుమార్, డిపిఎం రవీందర్, మున్సిపల్ కమిషనర్, డీఈ, తదితరులున్నారు.



# విధులకు గైర్హాజరైన వైద్యుడు సస్పెండ్



నల్గొండ, అక్టోబర్ 28:ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అనధికారికంగా విధులకు హాజరు కాని వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మంగళవారం రామన్నపేట ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విధులకు అనధికార గైర్హాజరైన ఆయుర్వేదిక్ డాక్టర్ ను సస్పెండ్ చేశారు. అలాగే మిగతా వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

ఆస్పత్రిలోని వార్డులను కలెక్టర్ కలియ తిరిగారు. వార్డులను, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్యులు మంచిగా వైద్యం అందిస్తున్నారా, సిబ్బంది ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉండడంతో నీరు బయటకు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలని తాసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్న నాయక్, తాసీల్దార్ లాల్ బహదూర్, వైద్యులు శ్రీనివాస్, వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లోని కాంకెర్ జిల్లాలో 21 మంది నక్సలైట్లు ఆయుధాలతో సహా లొంగుబాటు.. కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా హర్షం

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:ఛత్తీస్‌గఢ్‌లోని కాంకెర్ జిల్లాలో 21 మంది నక్సలైట్లు ఆయుధాలతో సహా లొంగిపోవడంపై కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

'ఎక్స్'లో శ్రీ అమిత్ షా ఒక సందేశాన్ని పొందుపరుస్తూ, ఇలా పేర్కొన్నారు: "ఛత్తీస్‌గఢ్‌లోని కాంకెర్ జిల్లాలో 21 మంది నక్సలైట్లు ఆయుధాలతో సహా లొంగిపోయారన్న సంగతిని మీతో పంచుకొనేందుకు సంతోషిస్తున్నాను. వారిలో 13 మంది సీనియర్ స్థాయికి చెందిన వారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకొని వారు హింసామార్గాన్ని విడిచి, ప్రధాన స్రవంతిలో చేరినందుకు వారిని నేను ప్రశంసిస్తున్నాను. తుపాకులు పట్టుకు తిరుగుతున్న మిగతా వారు కూడా సాధ్యమైనంత త్వరగా లొంగిపోవాల్సిందిగా నేను మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. నక్సలిజాన్ని 2026 మార్చి నెలాఖరు నాటికి నామరూపాలు లేకుండా చేయాలని వేం సంకల్పం చెప్పుకొన్నాం."

# ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై పోలీసులకు ఫిర్యాదు




యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 28 : అధికార దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ భాస్కర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీర్ల ఐలయ్యపై వస్తున్న ఆరోపణలను దృష్టి మళ్ళేందుకే ఎంపీ చామల, ఎమ్మెల్యే బీర్ల గత సోమవారం మాజీ మంత్రి హరీశ్ రావుపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన సైదాపురం మాసాయిపేట గివెన్ పరిధిలోని సర్వే నంబర్ 726లో సుమారు 15 ఎకరాల భూమిని రైతులను మోసం చేసి స్పెక్ట్రా వెంచర్‌కు విక్రయించారన్నారు. సదరు వెంచర్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పి ప్లాట్లు విక్రయించి కస్టమర్లను మోసం చేశాడన్నారు. వెంచర్‌లో ఎలాంటి డెవలప్‌మెంట్ చేయకుండా ఉండటంతో కస్టమర్లకు ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే చేసిన మోసంతో కష్టమర్లకు ప్లాటు దొరకడం లేదని దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

రాజపేట మండలంలోని చల్లూరు గ్రామంలో సర్వే నంబర్ 322లో 600 ఎకరాల సీలింగ్ భూమిని ఎలాంటి డాక్యుమెంట్ లేకుండా అక్రమంగా తన పేరున క్రమబద్ధీకరించుకున్నాడని పోలీసుల దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం సుమారు రూ.200 కోట్ల విలువ చేసే 100 ఎకరాల భూములను అక్రమార్గంలో సంపాదించాడని తుర్కపల్లికి చెందిన వ్యక్తి ఏసీబీ ఐటీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడని, దీనిపై సమగ్రంగా విచారించాలన్నారు. బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సుమారు 20 ఎకరాల భూమి వివాదం ఉండగా సెటిల్‌మెంట్ చేసి తీసుకున్నట్లుగా ఆరోపణలు ఉన్న విషయాన్నిఈ సందర్భంగా గుర్తు చేశారు.

రాజపేట మండలంలోని చల్లూరు గ్రామంలో ఎలాంటి పరిపాలనా అనుమతులు, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే క్రషర్ నిర్మాణం చేపట్టారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ చెరువు కట్ట వద్ద ఎకరం భూమి, నాగోల్ లోని రూ.13 కోట్ల భవనం, బంజారాహిల్స్ లోని రూ.13 కోట్ల విల్లాస్ తదితర స్థిరాస్తులు ఎలా కొనుగోలు చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్ సి ఎస్ చైర్మన్ ఇమ్మడి రామ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిట్ట వెంకటయ్య, కసావు శ్రీనివాస్, పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి, పేరు పాయింట్ సత్యనారాయణ, కొన్యాల నరసింహారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

# బొగ్గు మంత్రిత్వ శాఖ "కోయ్లా శక్తి" - స్మార్ట్ కోల్ అనలిటిక్స్ డాష్‌బోర్డ్‌ను ప్రారంభించనుంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:డిజిటల్ పరివర్తన మరియు మెరుగైన డేటా ఆధారిత పాలన వైపు ఒక ముఖ్యమైన అడుగులో, బొగ్గు మంత్రిత్వ శాఖ "కోయ్లా శక్తి" అనే స్మార్ట్ కోల్ అనలిటిక్స్ డాష్‌బోర్డ్‌ను ప్రారంభించనుంది, ఇది బొగ్గు రంగ కార్యకలాపాల యొక్క రియల్-టైమ్ పర్యవేక్షణ మరియు విశ్లేషణ కోసం ఏకీకృత వేదికగా ఉపయోగపడుతుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం 2025 అక్టోబర్ 29న న్యూఢిల్లీలోని ది ఒబెరాయ్ హోటల్‌లో బొగ్గు మరియు గనుల మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి సమక్షంలో జరుగుతుంది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు.

సాంకేతికత ఆధారిత పాలన ద్వారా డిజిటల్ ఇండియాను బలోపేతం చేయాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా, బొగ్గు మంత్రిత్వ శాఖ బొగ్గు రంగంలో డిజిటల్ వ్యవస్థలను ఏకీకృతం చేయడానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. కోయ్లా శక్తి ప్రారంభం ఈ ప్రయత్నంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది, బొగ్గు ఉత్పత్తి, రవాణా మరియు సరఫరాను పర్యవేక్షించడానికి ఏకీకృత, రియల్-టైమ్ డిజిటల్ ఇంటర్‌ఫేస్‌ను అందిస్తుంది. ఈ వేదిక డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడాన్ని అనుమతిస్తుంది మరియు మొత్తం బొగ్గు పర్యావరణ వ్యవస్థలో పారదర్శకత మరియు సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది.

బొగ్గు ఉత్పత్తి, డిమాండ్, లాజిస్టిక్స్ మరియు డిస్పాచ్‌కు సంబంధించిన డేటాను ఏకీకృతం చేయడానికి మరియు విశ్లేషించడానికి, తద్వారా రంగం అంతటా కార్యాచరణ పారదర్శకత మరియు సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి కోయ్లా శక్తి భావన చేయబడింది. డాష్‌బోర్డ్ రియల్-టైమ్ రిపోర్టింగ్, పనితీరు ట్రాకింగ్ మరియు ఆప్టిమైజ్డ్ లాజిస్టిక్‌లను అనుమతిస్తుంది, వాటాదారుల మధ్య సజావుగా సమాచార ప్రవాహాన్ని సులభతరం చేస్తుంది.

# రాజేంద్రనగర్‌లో ఎయిర్‌హోస్టెస్ ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబర్ 28: రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. ఓ ఎయిర్‌హోస్టెస్ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. జమ్మూకు చెందిన జాహ్నవి ఇండిగో విమాన యాన సంస్థలో ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తుంది. రాజేంద్రనగర్ పరిధిలో నివాసం ఉంటుంది. అయితే సోమవారం రాత్రి తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం తన గదిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని డెడ్‌బాడీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. విశాఖ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు మరో 10 కోట్లు కేటాయింపు

అమరావతి, అక్టోబర్ 28:ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు మరో రూ.10 కోట్లను కేటాయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం విశాఖ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌ను నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖ వేదికగా నవంబర్ 14, 15వ తేదీల్లో దీన్ని నిర్వహించనున్నారు. ఈ సమ్మిట్ నిర్వహణకు ఇప్పటికే పలు కమిటీలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే దుబాయ్ పర్యటనకు వెళ్లొచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.. అక్కడ ప్రముఖ వ్యాపారవేత్తలు, యూఏఈ మంత్రులతో 25 కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. విశాఖలో జరగనున్న సీఐఐ ఇన్వెస్టర్స్ మీట్‌కు రావాలని ఆహ్వానించారు.

# వికలాంగుల పాఠశాలలో 130 మంది విద్యార్థులు



కరీంనగర్, అక్టోబర్ 28: స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సేవలు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిఅన్నారు. కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్లో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యా శిక్షణ కేంద్రానికి నూతన బస్సు ప్రారంభోత్సవం జరిగింది.

26 లక్షల రూపాయలతో శ్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ఈ బస్సు ను అందజేసింది. ఈ సమావేశనికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బస్సును ప్రారంభించి మానసిక విద్యార్థులకు కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మానసిక వికలాంగుల పాఠశాలను, వృత్తి విద్యా కేంద్రాన్ని స్థాపించి ట్రస్ట్ సభ్యులు నిర్విరామంగా దశాబ్దాల పాటు సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. దివ్యాంగుల మానసిక వికాసానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సేవలను కొనియాడారు.

ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మానసిక వికలాంగుల పాఠశాలలో 130 మంది విద్యార్థులు చదువుతున్నారని, 40 మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 136 మందికి కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ డీజీఎం సిహెచ్ వెంకట రెడ్డి, బోర్డు డైరెక్టర్ తిరుమల, ట్రస్ట్ వ్యవస్థాపకులు బి.వెంకటయ్య, ఇతర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ, ఓపి రిజిస్టర్ ను పరిశీలించారు. గర్భిణీలకు 4 ఏ.ఎన్.సి వైద్య పరీక్షల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

వారికి కచ్చితంగా నాలుగు ఏ. ఎన్. సి పరీక్షలు అయ్యేలా చూడాలని తెలిపారు. సాధారణ ప్రసవాల ప్రాధాన్యత పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణఉన్నారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం పరిశీలన

ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్‌మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అలింకో సహకారంతో నిర్వహించిన దివ్యాంగులకు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. శిబిరానికి హాజరైన వారి వివరాలు, వైద్య పరీక్షల వివరాలు పక్కాగా నమోదు చేయాలని అన్నారు.

# ప్రయాణీకుల భద్రత మరియు సౌకర్యాన్ని నిర్ధారించడానికి రైలు కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28:రాబోయే తుఫాను మంథా దృష్ట్యా సంసిద్ధతను కేంద్ర రైల్వే, సమాచార ఉ ప్రసార, ఎలక్ట్రానిక్స్ ఉ సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ఈ రోజు సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా జరిగిన ఈ సమీక్షా సమావేశంలో తూర్పు తీరం వెంబడి రైల్వే నెట్‌వర్క్ సంసిద్ధతను అంచనా వేయడంపై దృష్టి సారించారు.

ప్రయాణికుల భద్రత, రైలు నియంత్రణ, పునరుద్ధరణ ప్రణాళిక మరియు స్థానిక పరిపాలనలు మరియు విపత్తు నిర్వహణ సంస్థలతో సమన్వయం కోసం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి సమీక్షించారు. తుఫాను ప్రభావాన్ని ముందుగానే ఊహించి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన రైల్వే అధికారులను ఆదేశించారు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా మరియు తెలంగాణలోని తూర్పు తీరం వెంబడి.

నిరంతరాయంగా కమ్యూనికేషన్ మరియు విపత్తు ప్రతిస్పందన బృందాలను సకాలంలో మోహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, అన్ని రైల్వే జోన్‌లు హై అలర్ట్‌లో ఉండాలని మరియు తుఫాను తర్వాత రైలు సేవలను త్వరగా పునరుద్ధరించాలని కేంద్ర మంత్రి ఆదేశించారు.

రాబోయే తుఫాను మంథాకు రియల్-టైమ్ సమన్వయం మరియు ప్రతిస్పందన కోసం భారత రైల్వే డివిజనల్ వార్ రూమ్‌లను సక్రియం చేసింది. ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం మరియు గుంటూరు డివిజన్లలో అవసరమైన సామాగ్రి, యంత్రాలు మరియు మానవశక్తిని సిద్ధంగా ఉంచారు.

ప్రయాణీకుల అసౌకర్యాన్ని తగ్గించడానికి రైలు కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోంది. అత్యవసర ప్రతిస్పందన కోసం వనరులను సమీకరించాలని మరియు అవసరమైన అన్ని భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని తూర్పు కోస్ట్ రైల్వే , దక్షిణ కోస్ట్ రైల్వే మరియు దక్షిణ మధ్య రైల్వే జోన్‌లను ఆదేశించారు.

తూర్పు కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ పరమేశ్వర్ ఫంక్వాల్, విభాగాల ప్రధాన అధిపతులు మరియు డివిజనల్ రైల్వే మేనేజర్లు గౌరవ మంత్రికి వివరించారు. ముఖ్యంగా వాల్టెయిర్ మరియు ఖుర్దా రోడ్ డివిజన్లలో దుర్బల విభాగాలలో ఇప్పటికే ప్రారంభించిన ముందు జాగ్రత్త చర్యల గురించి వివరించారు

# మహిళపై కోపంతో ఐదేళ్ల కొడుకును చంపేసిన ఆటో డ్రైవర్

అమరావతి, అక్టోబర్ 28:అనంతపురంలో దారుణం జరిగింది. తన భార్య తనకు దూరం కావడానికి పక్కింటి మహిళనే కారణమని ఓ ఆటో డ్రైవర్ భావించాడు. ఆమెపై పగ పెంచుకుని ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నాడు. ఈ క్రమంలో ఆమె ఐదేళ్ల కుమారుడిని ఎత్తుకెళ్లి అతి కిరాతంగా హతమార్చాడు.

అనంతపురం నగరంలోని అరుణోదయ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ పెన్నయ్య తన భార్య సావిత్రితో కలిసి ఉండేవాడు. గోవిందహరి ఇంటి సమీపంలో పెన్నయ్య, సావిత్రి దంపతులు నివాసం ఉంటున్నారు. సావిత్రి, పక్కింటి నాగవేణి ఇద్దరూ స్నేహితులు. పెన్నయ్యతో గొడవ జరిగినప్పుడు నాగవేణి దగ్గరకు సావిత్రి వెళ్లేది. దీంతో తన భార్య సావిత్రికి లేనిపోనివి చెప్పి.. తమ మధ్య మనస్పర్థలు పెరిగేలా చేసిందని నాగవేణిపై పెన్నయ్య పగ పెంచుకున్నాడు. ఆమెపై ఎలాగైనా పగ తీర్చుకోవాలని అనుకున్నాడు.

ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన అర్ధరాత్రి గోవిందహరి, నాగవేణి దంపతులు తమ కుమారుడు నాగ సుశాంత్ (5)ను ఇంట్లోనే వదిలేసి టిఫిన్ కోసం ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లారు. ఇది గమనించిన పెన్నయ్య నిద్రపోతున్న బాబును ఎత్తుకెళ్లి గొంతు నులిమి చంపేశాడు. అనంతరం గోనె సంచిలో చుట్టి దోబీఘాట్‌లోకి విసిరేశాడు. అయితే సావిత్రి దంపతులు ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి బాబు కనిపించలేదు. చుట్టుపక్కల కనిపించకపోవడంతో ఆచూకీ దొరక్కపోవడంతో ఆదివారం నాడు అనంతపురం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి.. పెన్నయ్యనే హతమార్చినట్లు గుర్తించారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

# తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి.. రుద్రంగి తహసీల్దార్ పుష్పలత

కరీంనగర్, అక్టోబర్ 28:మోంథా తుఫాన్ పట్ల మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పుష్పలత సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

వాతావరణ శాఖ సూచనల మేరకు రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడవకుండా



టార్ఫాలిన్ కవర్లు కప్పుకోవాలని రైతులు అప్రమత్తంగా ఉంటూ సూచించారు. తుఫాన్ ముగిసే వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# హరీశ్‌రావు తండ్రి మృతిపట్ల వైఎస్ జగన్ సంతాపం

అమరావతి, అక్టోబర్ 28: మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి పట్ల ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేశారు.

హరీశ్‌రావు తండ్రి మృతి పట్ల ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిన ప్రార్థించారు.

ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.

కాగా, తన్నీరు సత్యనారాయణ రావు భౌతిక కాయానికి పార్టీ అధినేత కేసీఆర్ నివాళులు అర్పించారు. పుష్పాంజలి ఘటించారు. తన బావ సత్యనారాయణరావు (కేసీఆర్ 7వ సోదరి (అక్క) లక్ష్మి భర్త) తో తన అనుబంధాన్ని స్మరించుకున్నారు.

సత్యనారాయణరావు మృతిపట్ల విచారం వ్యక్తంచేశారు. తన సోదరి లక్ష్మిని, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. సత్యనారాయణరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అంతకుముందు సత్యనారయణ రావు మృతి విషయం తెలిసిన వెంటనే కేసీఆర్ ఫోన్‌లో హరీశ్ రావును పరామర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సింగరేణి సీఐని కలిసిన ఆదివాసీ నాయకులు



ఖమ్మం, అక్టోబర్ 28:సింగరేణి సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎన్.సాగర్‌ను ఆదివాసీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కారేపల్లిలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ సాగర్‌ను కలిసిన నాయకులు ఆయనను సన్మానించారు. మండలంలో శాంతి భద్రతలు, ప్రజాసేవలు, పోలీసులు చేపట్టుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. మండలంలో ఎలాంటి సమస్య వచ్చినా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సమన్వయంతో ముందుకు వెళ్తామని సీఐ నాయకులకు వివరించారు. సీఐని కలిసివారిలో ఎర్రబోడు మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, సీనియర్ నాయకులు కరపాటి సీతారాములు, పొలంపల్లి, కారేపల్లి మాజీ ఉప సర్పంచ్‌లు ముక్తి కోటేశ్వరరావు, పులసం భద్రం, నాయకులు సోది కోటేశ్వరరావు, పొడుగు హరీష తదితరులు పాల్గొన్నారు.

# సువర్ణముఖి దూకుడు.. అధికారులు అప్రమత్తం



తిరుపతి, అక్టోబర్ 28:మొంథా తుఫాన్ దాటికి ఏర్పేడు మండలంలో పలు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

సువర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది . నచ్చనేరి గ్రామపంచాయతీలో గిరిజనుల ఇల్లు రెండు నెలకొరిగాయి.

పాక్షికంగా దెబ్బతిన్న గిరిజనుల ఇళ్ల నుంచి గిరిజనులను సురక్షిత ప్రదేశానికి తరలించి అధికారులు వారికి అవసరమైన ఏర్పాట్లు తహసిల్దార్ భార్గవి ఎంపీడీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. కోబాక పంచాయతీలోని గిరిజనులను 23 మందిని సురక్షిత ప్రదేశానికి తరలించారు.

వాగులు ,వంకలు దాటకుండా గ్రామాలలో దండోరా వేసి అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. సువర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో నది ఎవరు దాటకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు గుడిమల్లం వద్ద శీతకాలవ పొంగి ప్రవహిస్తూ ఉంది.

మండలంలోని అనేక చెరువులు దాదాపు పూర్తిగా నిండాయి. అధికారులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు నాగరాజు నాయుడు ఇతరులు పర్యటిస్తూ గ్రామాల్లో అవసరమైన ఏర్పాట్లను చూస్తున్నారు.

# 'విచ్చలవిడి పార్కింగ్‌తో ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు'

ఖమ్మం, అక్టోబర్ 28: దుకాణాల ఎదుట, రోడ్లపై వాహనాలను విచ్చలవిడిగా నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని టేకులపల్లి ఎస్ఐ అలకుంట రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రహదారులపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గుట్కా, తంబాకు, కైని వంటి ఉత్పత్తులను విక్రయించవద్దని దుకాణదారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

